ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
బుధవారం 1 అక్టోబరు 2025




తుమ్మలను కలిసి సమస్యలు వివరిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 'స్థానిక' పోరుపై మంత్రితో ఎమ్మెల్యే జారె ఏకాంత చర్చలు

దమ్మపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం గండుగులపల్లిలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ రాజకీయ పరిస్థితిని తుమ్మలకు వివరించినట్లు సమాచారం. ఇద్దరూ స్థానిక సంస్థలపై ఏకాంతంగా కొద్దిసేపు చర్చించారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పార్టీలోని అందరినీ సమన్వయం చేసుకుంటూ గెలిచే అభ్యర్థులనే ఎంపిక చేయాలని ఎమ్మెల్యేకు సూచించారు. ఈ సందర్భంగా జారే ఆదినారాయణ స్థానిక సమస్యలను తుమ్మల దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. అనంతరం దమ్మపేట మండలానికి చెందిన పలువురు నాయకులు తుమ్మలను కలిసి పలు సమస్యలను విన్నవించారు. తుమ్మలను కలిసిన వారిలో కొయ్యల అచ్యుతరావు, మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాద్, కేవీ సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, తుమ్మల శేషబాబు, తదితరులు ఉన్నారు.

వీరలక్ష్మి అలంకరణలో అమ్మవారు



భద్రాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో గల లక్ష్మీతాయారు అమ్మవారు వీరలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చిత్రకూట మండపంలో శ్రీరామాయణ పారాయణం కొనసాగుతోంది.

ఇసుక దొంగలు!

ఏపీ టు తెలంగాణ వయా అశ్వారావుపేట





- భారీగా ఇసుక అక్రమ రవాణా
- నిత్యం పదుల సంఖ్యలో ఖమ్మం, హైదరాబాద్, నల్గొండకు ఇసుక లారీలు
- వాహనాల ముందు ప్రత్యేకంగా పైలెట్ల ఏర్పాటు
- మామూళ్ల మత్తులో చర్యలు తీసుకోని అధికారులు

జిల్లాలో ఇసుక దొంగలు రెచ్చిపోతున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇసుక ఓ ప్రధాన ఆదాయ వనరుగా మారింది. ఇసుకకు మంచి డిమాండ్ ఉండడం.. ఏపీలో ఉచితంగా ఇసుక దొరుకుతుండడంతో జిల్లాకు చెందిన కొందరు అక్రమార్కులు ఏపీ నుంచి తెలంగాణలోని పలు ప్రదేశాలకు ఇసుకను తరలిస్తున్నారు. లారీలలో పెద్ద ఎత్తున తరలించి.. దర్జాగా దండుకుంటున్నారు. ఇసుక వ్యాపారులు ఏపీ నుంచి అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్ వరకు ఎక్కడికక్కడ నిఘా, పైలెట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని అత్యంత పకడ్బందీగా దందా నిర్వహిస్తున్నారు.

అశ్వారావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి)

ఇసుక వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఏపీ నుంచి అశ్వారావుపేట మీదుగా హైదరాబాద్ వరకు ఎక్కడికక్కడ నిఘా, పైలెట్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని అత్యంత పకడ్బందీగా దందా నిర్వహిస్తున్నారు. తలా పాపం.. తిలా పిడికెడు అన్న చందంగా.. ఈ మొత్తం వ్యవహారంలో సత్తుపల్లి పరిసరాలకు చెందిన కొందరు దళారులు, పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. వీరి ద్వారా ఎవరెవరికి, ఏమేమి అందాలో.. నెలకు లారీకి ఇంత అని ముట్టచెబుతున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

రాష్ట్రంలో ఇసుక వనరులు ఉన్నప్పటికీ.. ఇక్కడ ప్రభుత్వం వాటికి అనుమతులు ఇవ్వలేదు. ఇదే సమయంలో ఏపీలో అక్కడి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందజేస్తుంది. ఇంకేం!? అక్రమ సంపాదనకు ప్రాంతాల సరిహద్దులను చెరిపేసి.. అక్కడి వారితో జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతానికి చెందిన కొందరు దళారులు, వ్యాపారులు కలిసి పోయి కొవ్వూరు ప్రాంతం నుంచి ప్రతీ నిత్యం వందలాది లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. ప్రతీ రోజు 70-80 లారీల ఇసుక ఈ విధంగా తెలంగాణలోకి వస్తున్నట్టు అనధికార అంచనా. ఏపీ నుంచి వయా అశ్వారావుపేట, మేడిశెట్టివారిపాలెం వైపుగా ఇసుక లారీలు తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. శనివారం రాత్రి దమ్మపేట పోలీసులకు మూడు ఇసుక లారీలు ఏపీ నుంచి నల్గొండ వైపునకు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డాయి. నాలుగు రోజుల క్రితం దమ్మపేట మండల శివారులోనూ రెండు ఇసుక లారీలు పోలీసులకు పట్టుబడ్డాయి. అలాగే సత్తుపల్లి, అశ్వారావుపేటలో కూడా గతంలో ఇసుక లారీలు పట్టుబడ్డాయి. ఒక్కోలారీలో 30 నుంచి 40టన్నుల ఇసుకను తరలిస్తున్నారు. ఏపీలో ఉచితంగా


దమ్మపేట మండలంలో పట్టుబడ్డ ఇసుక లారీ (ఫైల్)

పొందుతున్న ఇసుకను లారీల్లో రాష్ట్రంలోని సత్తుపల్లి, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఇసుకను యథేచ్ఛగా తరలించుకొని పోతున్నారు. బయటి ప్రాంతాలకు తరలిస్తున్న ఇసుకను ఒక్కో లారీకి రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. ఇసుక రవాణా చేసే దళారులు వాహనాల ముందు ప్రత్యేకంగా కార్లలో పైలెట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వీరికి ఒక్కో లారీకి రూ.5వేల వరకు ముడుతోంది. ఈ పైలట్ వాహనాలు ముందుగా వచ్చి పరిసరాలను పరిశీలించి ఓకే చెప్పిన తర్వాతే.. ఇసుక వాహనాలు తెలంగాణలోకి అడుగు పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇసుక లారీలు గమ్యం చేరేంత వరకూ పైలెట్ వాహనాలు, మరికొంత మంది స్థానికులు (మిగతా 8వ పేజీలో)

ఎగువ భాగాన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది మంగళవారం సాయంత్రం 5 గంటలకు 50 అడుగులకు చేరుకుంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు భద్రాచలం వద్ద 47.1 అడుగులకు చేరుకోగా.. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు 48 అడుగులకు చేరుకుంది. దీంతో జిల్లా కలెక్టర్ జితేష్‌వి పాటిల్ రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఉదయం 6 గంటలకు 48.5 అడుగులకు చేరుకోగా 9 గంటలకు 49.1 అడుగులకు, 12 గంటలకు 49.6 అడుగులకు చేరుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు 49.8 అడుగులకు చేరుకోగా.. 5 గంటలకు 50 అడుగులకు చేరుకుంది. 6 గంటలకు సైతం 50 అడుగుల వద్దే నిలకడగా ఉంది.


కల్యాణ కట్ట కింది భాగం పూర్తిగా మునిగిన దృశ్యం

50 అడుగుల వద్ద
నిలకడగా గోదావరి

- భద్రాద్రి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- నీట మునిగిన దేవస్థానం కల్యాణకట్ట కింది భాగం
- పరిశీలించి సూచనలిచ్చిన సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట
- మరోసారి గోదావరిలోకి ప్రవేశం లేదంటూ హెచ్చరిక బోర్డులు
- రెండో రోజూ నిలిచిన రాకపోకలు

భద్రాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన పేరూరు వద్ద వరద తగ్గుముఖం పట్టడంతో భద్రాచలం వద్ద గోదావరి నిలకడగా ఉంది. బుధవారం నాడు గోదావరి మరింతగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. నదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు లేకపోవడంతో ఈ ప్రభావం కారణంగా నీటిమట్టం తగ్గుముఖం పడుతుందని వారు పేర్కొంటున్నారు.

నీట మునిగిన కల్యాణకట్ట కింది భాగం

గోదావరి 50 అడుగులతో ప్రవహిస్తుండడంతో.. ఆ ప్రభావం కారణంగా భద్రాచలం గోదావరి కరకట్ట వద్ద ఉన్న దేవస్థానం కల్యాణ కట్ట కిందిభాగం పూర్తిగా నీట మునిగింది. దీంతో కల్యాణకట్టను అక్కడ మూసివేసి వందగదుల సత్ర ప్రాంగణంలో భక్తులు తలనీలాలను సమర్పిస్తున్నారు. ఇదిలా ఉండగా భద్రాచలం నుంచి చర్ల వైపు (మిగతా 6వ పేజీలో)



రేపటి నుంచి కోట మైసమ్మ తల్లి మహా జాతర

- అన్నిఏర్పాట్లు చేసిన నిర్వాహకులు
- లక్షలాదిగా తరలి రానున్న భక్త జనం
- 200మంది పోలీసులతో భారీ బందోబస్తు

7



సద్దుల బతుకమ్మ రోజున..
9 మంది శిశువుల జననం

గర్భిణులకు సాధారణ ప్రసవం చేసిన వైద్యురాలు సాత్విక

భద్రాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ రోజున తొమ్మిది మంది శిశువులకు ఒకే ఒక్క గైనకాలజిస్టు సాధారణ ప్రసవం చేసిన అరుదైన సంఘటన ఇది. భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సోమవారం రాత్రి తొమ్మిదిమంది గర్భిణులకు సాధారణ ప్రసవాన్ని వైద్యురాలు సాత్విక, మిడ్‌వైఫ్ ప్రశాంతి, నర్సింగ్ అధికారి గీత నిర్వహించారు. సద్దుల బతుకమ్మ పండుగ రోజున తొమ్మిది మంది శిశువులు జన్మించగా.. అందులో ఆరుగురు ఆడ శిశువులు, ముగ్గురు మగ శిశువులు. ప్రైవేటు వైద్యశాలలో అధికంగా సీ సెక్షన్లు చేస్తున్న క్రమంలో.. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సాధారణ ప్రసవాలను ఓ వైద్యురాలు తమ సిబ్బంది సహకారంతో నిర్వహించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సాధారణ ప్రసవం నిర్వహించిన వైద్యురాలు, సిబ్బందిని డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ వై.రాజశేఖర్‌రెడ్డిలు అభినందించారు.

'స్థానిక' ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

- నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి
- ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటించాలి
- సోషల్ మీడియాలో అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు
- సన్నాహక సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మంగళవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్.. ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం, రాజకీయ పార్టీల నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల వ్యయాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తక్షణ చర్యలు, ఫ్లయింగ్ స్క్వాడ్ కార్యకలాపాలపై చర్చించారు. ఎన్నికల సమయంలో అధికారులు, సిబ్బంది ఎటువంటి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనరాదని, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ ఫొటోలు, క్యాలెండర్లు, వాల్ పోస్టర్లు, కటౌట్లు తొలగించాలని ఆదేశించారు. అలాగే రాజకీయ విగ్రహాలకు ముసుగులు కప్పాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం పంపిణీని గుర్తించి అరికట్టడానికి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రత్యేక చర్యలు చేపడతాయన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్‌తోనే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బస్టాండ్‌లు, పబ్లిక్ పార్కులు వంటి ప్రదేశాల్లో ఉన్న హోర్డింగులు, బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లను తొలగించాలని ఆదేశించారు. ప్రజలను ప్రభావితం చేసేలా గోడలపై రాసిన నినాదాలను చెరిపేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పకడ్బందీగా.. కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతి భద్రతలను కాపాడేందుకు మూడంచెల భద్రత ఏర్పాటుకు ప్రత్యేక బలగాలను నియమిస్తున్నట్టు చెప్పారు. అక్రమంగా నగదు, మద్యం పంపిణీ అడ్డుకట్ట వేసేందుకు అంతర్‌రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, ఎలాంటి ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలీసులు పూర్తిస్థాయి సహకారం అందిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం (మిగతా 8వ పేజీలో)


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు, సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

బూర్గంపాడులో తొలిసారి మండల పరిషత్ ఎన్నికలు


సారపాక గ్రామపంచాయతీ కార్యాలయం

బూర్గంపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత బూర్గంపాడు మండల పరిషత్ ఎన్నికలు తొలిసారి జరగనున్నాయి. రాష్ట్రమంతటా గతంలో స్థానిక ఎన్నికలు జరిగినా బూర్గంపాడులో నిర్వహించలేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత బూర్గంపాడు మండల పరిషత్, సారపాక గ్రామపంచాయతీ ఎన్నికలు ఇవే తొలిసారి కానున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2014లో రాష్ట్ర విభజనకు ముందు మండల పరిషత్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అనంతరం రాష్ట్ర విభజన జరగడంతో ఏపీలో విలీనమైన ఎంపీటీసీలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు అనంతరం మిగిలిన సభ్యులు ప్రమాణస్వీకారం చేసి పాలకవర్గం చేపట్టారు. అప్పటి నుంచి ఐదేళ్లపాటు పదవిలో ఉండాలని ఉత్తర్వులు ఉండడంతో పాలకవర్గాన్ని ప్రమాణాస్వీకారం నాటి నుంచి ఐదేళ్ల పాటు కొనసాగించారు. దీంతో 2019 ఎన్నికల సమయంలో బూర్గంపాడులో ఎన్నికలు నిర్వహించలేదు. చివరి ఎంపీపీగా కైపు రోశిరెడ్డి బాధ్యతలు నిర్వహించారు. పాలకవర్గం ముగిసిన తర్వాత అధికారులు పలుమార్లు ఎన్నికలు నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేసిన ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటినుంచి మండల పరిషత్‌కు ప్రత్యేక అధికారులను నియమించగా వారి ఆధ్వర్యంలో మండల పరిషత్ కొనసాగుతుంది. దీంతో ప్రస్తుతం జరగనున్న ఎన్నికలతో తొలిసారిగా మండల పరిధిలో 17ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

సారపాక గ్రామపంచాయతీ పరిస్థితి అంతే..

పారిశ్రామిక ప్రాంతంతో పాటు మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న సారపాకను మునిసిపాలిటీగా, గ్రామపంచాయతీగా, రెండు గ్రామపంచాయతీలుగా అనంతరం ఒక్కటే గ్రామపంచాయతీ ఏర్పాటు చేశారు. సారపాకలో చివరిసారిగా 2013లో ఎన్నికలు నిర్వహించారు. పాలకవర్గం 2018లో ముగిసింది. సారపాక చివరి సర్పంచ్‌గా ధరావత్ చందునాయక్ వ్యవహరించారు. 2018లో మున్సిపాలిటీగా మారుస్తున్నారనే ప్రచారంతో ఇక్కడ ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో పలువురు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వం రెండు గ్రామపంచాయతీలుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం సారపాకను ఒకటిగానే ఉంచాలని నిర్ణయించడంతో అధికారులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాన్ని అధికారులు ఎస్టీ మహిళకు కేటాయించారు.ఎట్టకేలకు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఆశావహులు ఎవరికి వారు సర్పంచ్ స్థానాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో ఎస్సీలకు తీరని అన్యాయం

» షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో ఎస్సీలకు తీరని అన్యాయం జరిగిందని, హైకోర్టును ఆశ్రయిస్తామని హెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక (ఎస్‌సిహెచ్‌పిఎస్) అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతం పేరుతో ఎస్సీ కులాల భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలపై హైకోర్టులో దావా వేస్తామని వెల్లడించారు. పాలన సౌలభ్యం కోసం ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడిందని, ఎస్సీలంతా మేలుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి దయానందరావు, గోడ రమేష్, డాక్టర్ మద్దెల శివకుమార్, కూసపాటి శ్రీనివాస్, అల్లిశంకర్, మంద వెంకటేశ్వర్లు, కొండ జంపన్న, కండే రాములు, అల్లూరి సాంబశివరావు, గిరిశం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

చరమాంకంలో.. సంతోషంగా



» వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుదాం
» నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలీ/కొత్తగూడెం అర్బన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చెట్టుకు పూసిన పూలు వాడిపోక మానవు. అలాగే, పుట్టిన ప్రతి మనిషిలో వృద్ధాప్యం రాకమానదు. ఇదంతా సృష్టిధర్మంలో భాగం. ఒకరోజు మనమూ వృద్ధులమవ్వాల్సిందే అన్నది మరిచిపోవద్దు. ప్రతి ఇంట్లోనూ ముసలివాళ్లుండటం సర్వసాధారణం. అన్ని దశల మాదిరిగానే వృద్ధాప్యం వస్తుంది. ఇది అచ్చం పసితనం మాదిరిగానే ఉంటుంది. కొంటె అల్లరి వీరిలో కనిపిస్తుంది. చిన్న పలకరింపునే వారు కోరుకుంటుంటారు. ఆత్మీయుల కోసం ఎదురు చూస్తుంటారు. మనవలు, మనవరాళ్లతో ఆడుకోవాలని ఉబలాటపడుతుంటారు. అదేదో తప్పయిపోయినట్లు చాలా మంది వారిపై కసురుకుంటుంటారు. ఒకరోజు మనమూ వృద్ధులమవ్వాల్సిందే అన్నది మరిచిపోవద్దని చెప్పడానికే ఏటా అక్టోబరు1 న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని జరుపుకుంటుంటాం. ప్రస్తుత సమాజంలో అందరు ఉన్నా ఏకాకుల మాదిరిగా జీవనం సాగిస్తున్నారు. చాలా మంది వృద్ధులు. కొడుకు ఉద్యోగమే కారణంగా కావచ్చు.. మామను తండ్రిలా చూసే గుణం కోడలిలో లేకపోవడం కావచ్చు. ఏదైతేనేం తమ అందమైన జీవితాన్ని కుమారులు, కుమార్తెల విద్యాబుద్ధులు, పెండ్లిళ్లు, ఉద్యోగాల కోసం వెచ్చిస్తున్నా మలిదశలో వారు కనీస ఆత్మీయత కూడా అందకోలేని దుస్థితిలో ఉంటున్నారు. మలిసంధ్యకు చేరి ఆసరాగా లేని వారి వల్లే ఎన్నో వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి. ప్రేమ, ఆత్మీయతలు లేని సంసారాల వల్ల, ఉద్యోగాల పేరిట దూరమైపోయిన కొడుకు- కోడళ్ల వల్ల, గృహ సంబంధ వివాదాల వల్ల దూరంగా ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కారణమేదైనా ఫలితం మాత్రం పండుటాకులైన తల్లిదండ్రుల మీద పడుతున్నది. అవసాన దశలో బుక్కెడు బువ్వకు, జానెడు నీడకు తడుముకోవాల్సిన దీనస్థితిలో చిక్కుకుపోకుండా చూడాల్సిన కనీస ధర్మం మనది. వారి ఆరోగ్యం పట్ల కనీస శ్రద్ధ చూపుదాం. వారిని మన పిల్లల్లానే ఆదరిద్దాం. చివరి రోజుల్లో ఆనందంగా ఉండనిస్తూ మనమూ ఆనందంగా గడుపుదాం. ప్రతి ఒక్కరిలో వృద్ధాప్యం అనివార్యం. సహజం అనేది మరిచిపోయి ప్రవర్తించకుండా ఉందాం.

ఖమ్మం జిల్లాలో...

మహిళా శిశు, వృద్ధుల సంక్షేమ శాఖ పరిధిలో ఖమ్మం జిల్లాలో మొత్తం 13 వృద్ధాశ్రమాలు ఉన్నాయి. వాటిలో మొత్తం 350 మంది వృద్ధులు ఉన్నారు. వీరుకాక మరో 20 వరకు అనధికారిక వృద్ధాశ్రమాలలో మరో 500 వంద మంది వరకు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది వారి కుమారులకు విద్యా బుద్ధులు నేర్పించి ఉద్యోగాల నిమిత్తం ఇతర దేశాలకు పంపించటంతో వారు అక్కడే సెటిల్ అయి తల్లితండ్రులను వృద్ధాశ్రమాలలో నెలవారి డబ్బులు చెల్లించి వారి మంచి చెడులను వృద్ధాశ్రమ నిర్వాహకులకు అప్పగిస్తున్నారు. రోడ్లపై అనాథలుగా ఉంటూ భిక్షమెత్తుకుంటున్న పలువురిని నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ల నిర్వాహకులు చేరదీసి ఆశ్రయం కల్పిస్తున్నారు. ఇలా ఎంతో మంది తల్లిదండ్రులను రోడ్లపై విడిసిపెట్టి మాకెలాంటి సంబంధం లేదు మాకు ఆయన ఏమి ఆస్తిపాస్తులు ఇవ్వలేదు అని చెప్పి అనాథలుగా వదివేస్తున్న వారికి కనివిప్పు కలగాలని, తల్లిదండ్రులను చేరదీసి వారికి సేవలు చేయాల్సిన రక్త సంబందీకులే శత్రులైతుంటే ఏమి చేయలేని నిస్సాహయ స్థితిలో తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు మన కండ్లకు కనపడుతున్నా ఏమి చేయలేని పరిస్థితులలో ప్రభుత్వం, ప్రజలు ఉన్నారంటే సమాజం ఎటుపోతుందో తెలియని పరిస్థితి. నేడు మనం చేసేది మన పిల్లలు చూస్తూ మనకు ఇలాంటి పరిస్థితే వస్తుందని ఆలోచించని కుమారులు, కుమార్తెలు ఉన్నన్ని రోజులు తల్లితండ్రులకు ఇబ్బందులు తప్పని పరిస్థితి. ఇకనైనా తల్లితండ్రులను గౌవరించి వారిని ఉమ్మడి కుటుంబంలోకి ఆహ్వానించాలని కోరుకుందాం.

వృద్ధులకు న్యాయం కోసం..

భద్రాద్రి జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం మొత్తం 46,855 మంది వయో వృద్దులు చేయూత పెన్షన్ పొందుతున్నారు. తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, 2011 నియమావళిని అనుసరించి ఒంటరి వృద్దులకు భరోసా ఇచ్చేందుకు ప్రభుత్వం రూపొందించింది. వృద్ధుల రక్షణకు 2007చట్టంలో నిబంధనలతో కూడిన ఆస్తి బదలాయింపును చేర్చారు. తల్లిదండ్రులు నిరాదరణకు గురైతే తమ బిడ్డలకు రాసిచ్చిన ఆస్తిని బేషరతుగా తిరిగిపొందే హక్కును కల్పించాలని డిమాండ్ వినిపిస్తుంది. 2019లో కేంద్రం వృద్ధుల సంక్షేమం మరింత మెరుగ్గా ఉండేందుకు చట్టానికి సవరణలు చేసింది. వాటి ప్రకారం ప్రతి రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఒక ట్రిబునల్ ఏర్పాటు అయ్యింది. దీనికి అర్డీవో, సబ్ కలెక్టర్ స్థాయి అధికారి చైర్మన్, స్వచ్ఛంధ సంస్థల నుంచి ఒకరు లేదా ఇద్దరు సభ్యులుగా ఉంటారు. బాధిత వృద్దులకు ఉచితంగా వారి బిడ్డల నుంచి రక్షణ, పోషణ కల్పిస్తారు. బాధితులకు తీర్పు నచ్చని పక్షంలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటు అయ్యే అప్పిలేట్ ట్రిబునల్‌ను 60రోజుల్లో ఆశ్రయించి అంతిమ న్యాయం పొందవచ్చు. జిల్లాలో ఈ చట్టం కింద భద్రాచలం సబ్‌కలెక్టర్, కొత్తగూడెం అర్డీవో కార్యాలయాల్లో మొత్తం 141 కేసులు నమోదు కాగా 118 కేసులు పరిష్కరించారు. 23 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవే కాకుండా 14567 ద్వారా 149 కేసులు నమోదు కాగా 148 కేసులు పరిష్కరించగా 1కేసు పెంగింగ్‌లో ఉంది. జిల్లాలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భద్రాచలంలో మానవసేవ మాధవ సేవ, కొత్తగూడెంలో జ్యోతి, సత్యసాయి ఆశ్రమాలు, అశ్వారావుపేటలో అమ్మ, అశ్వాపురంలో అరిఫా రోష్ని, మానవీయ వృద్ధాశ్రమాలలో ఒంటరి వృద్దులు ఆశ్రయం పొందుతున్నారు.

మహాత్మా గాంధీ సేవలో..

కల్లూరు, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత సేవలో నిమగ్నమై నిత్యం పారిశుద్యం పనిచేస్తున్న ఓ మహిళకు గ్రామస్థుల చేత ముందుకు వచ్చి అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం సన్మానించనున్నారు. మండలంలోని చిన్నకోరుకొండి గ్రా మంలో రెడ్డి అనంతమ్మ గత అనేక సంత్సరాల నుంచి స్థానిక బొడ్డురాయి సెంటర్ వద్ద గల జాతిపిత విగ్రహ ప్రాంగణం వద్ద పారిశుధ్య కార్యక్రమం నిర్వహిస్తుంది. ఆదే క్రమంలో విగ్రహం వద్ద శుభ్రంగా ఊడ్చి కళాపు చల్లి ముగ్గులు వేసి అలంకరణ చేస్తుంది. ఇలా స్వచ్ఛం దంగా అనంతమ్మ గాంధీ సేవలో అడుగులు వేస్తూ సమాజంలో ఇతరులకు ఆదర్శంగా నిలిచింది. ఇంకాను గ్రామ దేవత అయిన బొడ్డురాయి సెంటర్ వద్ద కూడా పరిశుభ్రం చేస్తుంది. దీంతో పాటుగా ఈ విగ్రహం గతం లో శిధిలమై ఉండగా విశ్రాం త ఏఎస్ఐ కుమ్మరి రామారావు కొంత నగదును వెచ్చించి ఆధునికంగా పునరుద్ధరణ చేశారు. అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా విశ్రాంత ఆర్ అండ్‌బీ ఛీఫ్ ఇంజనీర్ గుజ్జు చిన్నపుల్లాదాసుతో పాటు అనంతమ్మను సన్మానించనున్నారు.


మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ముగ్గు వేస్తున్న అనంతలక్ష్మి

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి

» అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. మండలంలోని లక్ష్మీపురం రెవిన్యూ పరిదిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ స్థలంలో జరుగుతున్న పనుల మ్యాపును చూసి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో జిల్లాలో చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రపంచంతో పోటి పడే విదంగా విద్యార్థులను తీర్చిదిద్దడమే యంగ్ ఇండయా పాఠశాలల లక్ష్యమని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇండోర్, అవుట్ డోర్ క్రీడల కోసం అన్ని ఏర్పాట్లు చేసేలా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఈఈ బుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.


ఇంటిగ్రేటెడ్ పాఠశాల మ్యాపును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

50 అడుగుల వద్ద నిలకడగా గోదావరి


భద్రాచలం వద్ద గోదావరి వరద

(5వ పేజీ తరువాయి)

వెళ్లే మార్గంలో తూరుబాక డైవర్షన్ రోడ్డు వద్ద రెండో రోజైన మంగళవారం సైతం రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే భద్రాచలం కూనవరం రోడ్డులో నెల్లిపాక, పొలిపాక, మురుమూరు వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పరిశీలించిన సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ

గోదావరి 50 అడుగులతో ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండటంతో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మంగళవారం గోదావరి నదీ తీరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులను ఎట్టి పరిస్థితుల్లో స్నానాలకు అనుమతించవద్దన్నారు. స్నానఘట్టాలకు వెళ్లే మార్గాలను పూర్తిగా మూసివేయాలని స్పష్టం చేశారు. అలాగే గోదావరి నీటి ప్రవాహం ప్రమాదకరంగా ప్రవహిస్తున్నందు వల్ల ఎవరూ గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరిక బోర్డులను సైతం భద్రాచలం తహసీల్దార్ పేరిట ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో గజ ఈతగాళ్లను సైతం నదీ తీరంలో సిద్ధంగా ఉంచారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దారు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.


సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, తహసీల్దారు వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న దృశ్యం

స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం కావాలి

ఖమ్మంఅర్బన్, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. సీపీఎం పాలేరు డివిజన్ కమిటీ సమావేశం మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయం సుందరయ్య భవనంలో జరిగింది. ఈసమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ప్రజలు వారికి అందుబాటులో ఉండి పనిచేసే నాయకులకే ఓట్లువేస్తారని కనుక సీపీఎం నాయకులు ప్రజల్లోకి వెళ్లాలని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధాలపై సీపీఎం ఇప్పటికే అనేక ప్రజాపోరాటాలు నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో పాలేరు డివిజన్ కార్యదర్శి బండిరమేష్ మాట్లాడుతూపార్టీకిబలం ఉన్న అన్ని చోట్లా పోటీచేసేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ,జిల్లకమిటీ సభ్యులు షేకబషీరుద్దీన్, నుండ్ర ప్రసాద్, ఊరడి సుదర్శన్ రెడ్డి, గొడవర్తినాగేశ్వరరావు కొమ్మిశ్రీను పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆళ్లపాడు విద్యార్థిని

బోనకల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడుకి చెందిన మొండితోక అప్జల్ కుమార్తె దీపిక ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. నీట్ పరీక్షలో ప్రతిభ చాటడంతో రెండో విడత కౌన్సిలింగ్‌లో కరీంనగర్‌లోని ప్రాతిమా కళాశాలలో సీటు వచ్చింది. పట్టుదలతో కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడంతో దీపికను మండల ప్రజలు, అధికారులు అభినందిస్తున్నారు.


దీపిక

ఆరోగ్యానికి ఆర్గానికల్ ఉత్పత్తులు


ప్రకృతి సహజసిద్ధ పంటలతో 112 రకాల ఉత్పత్తులు
ఇప్పనూనె నుంచి కాస్మోటిక్స్ తయారీ
అరకు నుంచి అటవీ విత్తనాల సేకరణ
పాల్వంచ తయారీ కేంద్రం నుంచి నెదర్లాండ్ వరకు

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మనం తాగే పాల నుంచి తినే అహార పదార్థాల వరకు ఎక్కువ శాతం కల్తీతో కూడినవి. హానికరమైన రసాయన మందులతో పండించిన పంటలు ప్రస్తుతం మార్కెట్‌లో ఇబ్బడి ముబ్బడిగా ఉంటున్నాయి. ఆహార ఉత్పత్తులే కాదు... కాస్మోటిక్స్‌లో సైతం కనిపించని కల్తీ...పనుల వత్తిడిలో కాలంతో పరుగులు తీస్తూ తినే ఆహారం పోషకాలతో కూడిందా కాదా అనే దృష్టి సారించలేక పోతున్నాం. తెలుసుకునే తీరిక లేని పనుల్లో పడి బిజీ లైఫ్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఉండే పదార్థాలను తింటున్న వైనం. అయితే అనారోగ్య పరిస్థితులు ఎదురైనపుడు వాటి ప్రభావం కనిపిస్తుంది. వైద్య శాలకు వెళ్లిన క్రమంలో వైద్య పరీక్షలు, మందులకు అయ్యే ఖర్చు అంతా... ఇంతా... కాదు. అందుకు కోవిడ్ ఒక గుణపాఠం ఈ నేపథ్యంలో ఒక ఆర్గానికల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని పూర్తిగా సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలు, అటవీ ప్రాంతాల నుంచి పలు రకాల విత్తనాలను సేకరించి ఉత్పత్తులు తయారు చేస్తూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పాల్వంచలో చరిత ఆర్గానిక్ కల్టివేషన్ సోలార్ డ్రైయర్‌తో 112 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. ఈ సందర్భంగా చరిత ఆర్గానికల్ కల్టివేషన్ ఉత్పత్తుల కేంద్రం చైర్మన్ పోతుల జయ ఆంధ్రజ్యోతితో ప్రత్యేక కథనం.

పాల్వంచలోని పేట చెరువు గ్రామంలో ఏడాది కాలంగా ఆర్గానికల్ ఉత్పత్తుల కేంద్రాన్ని నెలికొల్పారు. మూడు ఎకరాలలో మునగసాగు చేస్తున్నారు. సీజనల్ వారీగా అరకు, పూసుగుంపు అటవీ ప్రాంతాలలో ఉండే ఇప్ప పువ్వు తేనె నుంచి మొదలు పప్పు దినసుల వరకు ఆదివాసీలతో సేకరించి ఈ కేంద్రానికి తీసుకువస్తున్నారు. ఎటువంటి రసాయన పురుగు మందులను వాడకుండా స్వతహాగా సేంద్రీయ ఎరువలతో పంటలనవు పండిస్తున్నారు. మునగ ఆకును నాలుగు రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వేసవి కాలంలో మామిడి కాయల టెంకెలను, జీడి తీసి ఎండబెట్టిన వాటి నుంచి మ్యాంగో పౌడర్, ఇప్ప లడ్డు, ఇప్ప గింజల నుంచి ఆయిల్‌ను తీస్తున్నారు. లెమన్ గ్రాస్‌ను ఇక్కడనే పెంచడం, లెమన్ టీ, కరక్కాయ టీ, తాటికాయ, ఉసిరి, కలిపి పౌడర్ (త్రిపుర చూర్ణం) ప్యాకెట్స్, పదిరకాల కారం పొడిలు, మునగఆకు, పల్లీ, పుట్నాలు, పూదీన, కోతిమీర, ఎల్లిపాయ, నువ్వులు, కాకరకాయ, పచ్చిశనగపప్పు, నల్లకారం ఇటువంటి పొడులు తయారు చేపిస్తున్నారు. వీటితో పాటు కాస్మోటిక్స్ సోప్స్, లెవెండర్, బొప్పాయ, ఆరెంజ్, టమాట, కలమంద, అలోవేర ఇవి గుజరాత్‌కు ఫార్ములా ప్రకారం చేయడం గమనార్హం. ఇప్ప లడ్డు, నూనె, తేనె, ఆదివాసీలతోటే తయారు చేపిస్తున్నారు. వీటితో పాటు టమాట, మునగ, మహారాష్ట్ర నుంచి ముల్తాన్ మట్టి వేపాకు పౌడర్, మ్యాంగో సీడ్స్, బనానా పౌడర్ లాంటి వి కూడా ఇక్కడ ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులతో శాస్త్రీయ బద్ధంగా ఇక్కడ ఈ ఉత్పత్తులను తయారు చేయడం జరుగుతుంది. ఈ ఆర్గానికల్ కేంద్రంలో సోలార్ సిస్టంలో ఉత్పత్తులను ఎండబెట్టి శుద్ధి చేయడంతో పాటు వ్యవసాయ పనుల్లో సుమారు పది మంది మహిళల వరకు పనిచేస్తున్నారు. ఆర్గానికల్ ఉత్పత్తిలో నైపుణ్యత కలిగిన వారు ఉన్నారు. ఇప్ప లడ్డు, మ్యాంగో పౌడర్, కాస్మోటిక్స్ ఐటమ్స్ తయారు చేయడంలో వీరిలో ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ తయారు చేస్తున్న పలు రకాల ఉత్పత్తులు నెదర్లాండ్ వరకు తీసుకు వెళ్తున్నారు.



పాల్వంచలోని చరిత ఆర్గానిక్ కల్టివేషన్... సోలార్ ఉత్పత్తుల తయారీ కేంద్రం


సోలార్ డ్రైవ్‌లో విత్తనాలను శుద్ధి చేస్తున్న మహిళలు



ఉత్పత్తి తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కలెక్టర్ ప్రత్యేక చొరవ...

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చొరవతో చరిత ఆర్గానికల్ కేంద్రం సందర్శిస్తున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వల్ల ఆహార పదార్థాలు కలుషితమై ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్న నేపథ్యం ఆర్గానికల్ ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నారు. ఇక్కడ తయారు చేస్తున్న ఆహార ఉత్పత్తుల కేంద్రాన్ని అప్పుడప్పుడు వచ్చి పరిశీలించి , పలు సలహాలు ఇస్తున్నారు. కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తన తండ్రితో కేంద్రానికి వచ్చి తయారు చేసే వారికి సూచనలు సలహాలు ఇవ్వడం జరుగుతుంది.

కరోనా కాలంలో ఎన్నో అనుభవాలు.. చైర్మన్ పోతుల జయ

కరోనా కాలంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తినే ఆహార పదార్థాల్లో పోషకాలు లేకపోవడం వల్ల కరోనాకు తట్టుకోలేక పోయారు. వైద్య ఖర్చులకు సైతం డబ్బులు లేక మృతి చెందిన వారు ఎంతో మంది. ఈ క్రమంలో సేంద్రీయ ఎరువులతో ఎటువంటి రసాయన మందులు వాడకుండా పంటలు, ప్రకృతి సిద్ధమైన అటవీ ఉత్పత్తులను సేకరించి ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.


112 రకాల ఉత్పత్తులు ఇవే..

వైద్య ఆరోగ్య సేవలు సక్రమంగా ఉండాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సేవలు సక్రమంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా పరిపాలనా, సేవా నిబంధనలు ఫెసియల్ అటెండెన్స్ సిస్టం అమలుపై మాట్లాడారు. అదేవిధంగా ప్రభుత్వం ఆటోమేటెడ్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం తక్షణమే అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్యశాఖలో పారదర్శకతతో బాధ్యతలను మెరుగుపరుచు కోవాలన్నారు.

డిప్యూటీ డెమోకు ఆత్మీయ వీడ్కోలు

35 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ ప్రాంతాల్లో విశిష్ట సేవలు అందించిన భద్రాద్రి జిల్లా డిప్యూటీ డెమో ఫైజ్ మోహినుద్దీన్ సేవలు వెలకట్టలేనివని డీఎంహెచ్‌వో జయలక్ష్మి కొనియాడారు. మంగళవారం పదవీ విరమణ చేసిన డిప్యూటీ డెమోకు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. వారి శేష జీవితం విరజిల్లాలని ఆకాంక్షించి శుభాకాంక్షలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల బోనస్ చెల్లించాలి

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఈ ఏడాది వచ్చిన లాభాల నుంచి కాంట్రాక్ట్ కార్మికులకు ప్రకటించిన రూ.5500 లాభాల బోనస్‌ను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు యర్రగాని కృష్ణయ్య, క్రిష్టోఫర్‌లు డిమాండ్ చేశారు. యాజమాన్యం ప్రకటించిన కాంట్రాక్టర్లు చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. మంగళవారం కార్పొరేట్ ఏరియాలో నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ యాజమాన్యం కాంట్రాక్టర్ల ఖాతాలో జమచేయకపోవడం వల్ల ఆలస్యం జరుగుతుందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు దసరా పండుగలకు బోనస్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసింహా, వినోద్, అనసూర్య, శాంతాలక్ష్మీ, శ్రీను, కిరణ్, గణేష్, విక్రం తదితరులు డిమాండ్ చేశారు.

సోమనాథ్ సిఫారసుల అమలులో పూర్తిగా విఫలం

సత్తుపల్లిలో ఏఐపీకేఎంఎస్ డివిజన్ మహాసభ

సత్తుపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమనాథ్ సిఫారసుల అమలులో కేంద్రం పూర్తిగా విఫలమైందని ఏఐపీకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి వెంకన్న అన్నారు. ఏఐపీకేఎంఎస్ డివిజన్ మహాసభ మంగళవారం స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో నిర్వహించారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం రైతు వ్యతిరేక నల్లచట్టాల అమలుకు ప్రయత్నిస్తుందని, అదానీ, అంబానీల కార్పొరేట్ కంపనీలకు అప్పగించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాటాల్సిన అవసరం వ్యవసాయ కార్మికులకు ఉందని, తామంతా ప్రజా సమస్యల పక్షాన జరిపే పోరాటానికి అండగా ఉంటామని స్పష్టంచేశారు. నేడు ఉన్న నిత్యవసర ధరల ప్రకారం ఒక కుటుంబానికి రూ.26వేలు అవసరం ఉందని, ఇంతటి ఆదాయం సమకూర్చే శక్తి ప్రభుత్వాలకు ఉన్నా రూ.వేల లక్షల కోట్లు ఆస్తులు ఉన్న సంపన్నులకు, లక్ష కోట్ల రుణాలు మాఫీలు పొందిన వారికోసమే పనిచేస్తాయే తప్ప పేదవానిపై కనికరం ఉండదన్నారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మడి హనుమంతరావు, గంటా శ్రీనివాసరావు, బీరెల్లి లాజరు, ఒగ్గు నాగిరెడ్డి, అమర్లపూడి శరత్, తాటి రాజు, నున్నం కృష్ణ, కుంటా కృష్ణ, సంఘసాని వెంకటేష్, సారా కిషోర్, మారుతి శ్రీను, నల్లబోతుల మాణిక్యం, బూరుగు రామారావు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రైవేటు ఉపాధ్యాయుడు మృతి

బోనకల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ప్రైవేటు ఉపాధ్యాయుడు దామాల సునీల్ కుమార్(30) గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. సౌమ్యుడిగా పేరున్న సునీల్‌కుమార్ ఆకస్మిక మృతితో సహచర ఉపాధ్యాయులతో పాటు గ్రామంలో విషాదం నెలకొంది.


సునీల్‌కుమార్ (ఫైల్)

గోదా'వర్రీ'లో అన్నదాతలు

వరద ఉధృతితో నీట మునిగిన పంట పొలాలు
కన్నీటి పర్యంతమవుతున్న రైతులు

బూర్గంపాడు/మణుగూరు/దుమ్ముగూడెం/పినపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈసారి గోదావరి వరదలు నదీ పరివాహక ప్రాంత వాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఎగువ భాగాన కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతుంది. మంగళవారం గోదావరి నీటిమట్టం 50 అడుగులకు చేరుకుంది. దీంతో బూర్గంపాడు శివారులోని పత్తి, వరి, తదితర పంటలు నీట మునిగాయి. ఇప్పటికే పలు మార్లు వరద ఉధృతికి పంటలు మునిగిన సందర్భాలు ఉన్నాయి. పంటలు కోలుకుంటున్న క్రమంలో మరలా నీటమునగడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రైతులకు గోదావరి దెబ్బ మీద దెబ్బ తీస్తుందని ఆందోళన చెందుతున్నారు. గోదావరి వరద పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు. గోదావరి వరద సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని, వ్యవసాయ పనులకు వెళ్లే వారిని అప్రమత్తం చేస్తున్నారు.

పోటెత్తిన గోదావరి

మణుగూరు: గోదావరి వరద రెండో ప్రమాద హెచ్చరిక దాటి మూడో హెచ్చరికకు సమీపిస్తుండటంతో మణుగూరు మండలంలోని దిగువ ప్రాంతాల్లోని పొలాలు ముంపునకు గురయ్యాయి. మంగళవారం మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం చిన్నరావిగూడెం, అన్నారం, రామ్‌నగర్ ప్రాంతాల్లోకి గోదావరి పోటెత్తింది. దీంతో ఈ ప్రాంతాల్లో ఉన్న వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. స్థానికంగా ఉన్న వాగులైన కోడిపుంజుల వాగు, కట్టువాగు నీరంతా పోటెత్తిన వరదల వల్ల పొలాలను ముంచడం ఆరంభించాయి. దీంతో స్థానిక రైతులు ఆందోళన చెందుతున్నారు. కమలాపురం అన్నారం క్రాస్‌రోడ్ వద్ద గల భూములన్ని వరద ముంపునకు గురయ్యాయి. రహదారిపైకి కూడా నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ మండలాధికారులు, పోలీసులు వరద ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


కమలాపురంలో వరద నీటితో మునిగిన పంట పొలాలు చూపుతున్న రైతులు


పర్ణశాల విద్యుత్ స్టేషన్ వద్ద వరదనీరు

రెండో రోజూ కొనసాగుతున్న వరద ముంపు

దుమ్ముగూడెం: భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై మండలంలోని తూరుబాక డైవర్షన్ రోడ్డు వద్ద మంగళవారం రెండో రోజున కూడా గోదావరి వరద ముంపు కొనసాగుతోంది. చర్ల నుంచి భద్రాచలం వైపు వెళ్లే ఇసుక లారీలు భారీ సంఖ్యలో మండలంలో నిలిచిపోయాయి. మారాయిగూడెం మీదుగా భద్రాచలం- చర్లలకు రాకపోకలు సాగుతున్నాయి. సున్నంబట్టి- బైరాగులపాడుల మధ్య లోలెవల్ చప్టాపై వరదనీరు పెరగడంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. పర్ణశాల నారచీరల ప్రాంతం ముంపులోనే ఉం ది. పర్ణశాల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరింది.

ముంపునకు గురైన మిర్చి తోటలు

పినపాక : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతమైన చింతలబయ్యారం వెంకట్రావుపేట గ్రామాల మధ్యనున్న లోతట్టు ప్రాంతాలు గోదావరి వరద ముంపునకు గురయ్యాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడమేగాక, గోదావరి వరద పెరుగుతండడంతో ఆయా గ్రామాల్లో మిరపతోటలు సాగు చేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తోట మల్లయ్యతో పాటు మరో పది మంది సన్నకారు రైతులు సాగు చేసిన సుమారు 20 ఎకరాల మిరపతోటలు ముంపునకు గురయ్యాయి. ఇప్పటికే ఒక్కో ఎకరానికి దుక్కుతో పాటు, నాటుకు, పైపాటుకు సుమారు రూ.60 నుంచి రూ.80 వేల వరకు ఖర్చయినట్లు బాధిత రైతులు తెలిపారు.


గోదావరి వరదతో తన మిరపతోటను చూసుకుంటున్న రైతు మల్లయ్య

ఎన్‌ఎండీసీ యాజమాన్యంతో చర్చలు జరుపుతా

రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి హామీ

పాల్వంచ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎండీసీ ప్లాంట్ పునరుద్ధరణకు తన వంతుగా కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని యాజమాన్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చలు జరుపుతానని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాదులోని ఆమె నివాసంలో పాల్వంచకు చెందిన కాంగ్రెస్ నాయకులు షేక్ అబ్దుల్ జలీల్, బానోత్ బాలూనాయక్, వీరన్న కలిసి ఆమెకు ప్లాంట్ పరిస్థితిని వివరించారు. ఇందుకు స్పందించిన రేణుకాచౌదరి కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌ను అభివృద్ధి చేయని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపించే విధంగా స్వయంగా తానే పూనుకుని ప్లాంట్ పూర్వవైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


రేణుకా చౌదరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు తగవు

ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకునేది లేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హెచ్చరించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, మాజీ జెడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఉన్న మంత్రుల ప్రోద్బలంతోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించి తమ కార్యకర్తలను ఆత్మహత్య చేసుకునే విధంగా పీడిస్తున్నారని వాపోయారు. తిరుమలాయపాలెం మండలం కాకరవాయిలో సోమవారం జరిగిన సంఘటనలో తమ కార్యకర్తపై ఆ మండల ఎస్సై కూచిపూడి జగదీష్ తప్పుడు కేసు నమోదు చేసి వేధించడంతో కార్యకర్త బానోత్ రవి ఆత్మహత్యకు ప్రయత్నించాడని వాపోయారు. తప్పుడు కేసులుపెట్టిన పోలీసులపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం వారు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణు, గిరిబాబు, ఉన్నం బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కోటమైసమ్మ మహా జాతరకు ఏర్పాట్లు పూర్తి

రేపటి నుంచి 6వ తేదీ వరకు జరగనున్న జాతర
వివిధ జిల్లాల నుంచి 5 లక్షలకు పైగా రానున్న ప్రజలు
200 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు

కారేపల్లి సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో దసర పండుగను పురష్కరించుకుని ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు జరగనున్న శ్రీ కోటమైసమ్మ మహా జాతరకు నిర్వహాకులు అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు మంగళవారం ఆలయ ట్రస్ట్ చైర్మన్, ఈవో తెలిపారు. ఈ జాతరకు వివిధ జిల్లాల నుంచి సుమారు 5లక్షలకు పైగ భక్తజనం హాజరై అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. జాతరకు వచ్చే వారికోసం వినోదాలు పంచేందుకు అనేక రకాల స్టాల్స్‌ను జాతరలో ఏర్పాటు చేశారు. ఆర్టీసీ అధికారులు ఖమ్మం-ఇల్లెందు డిపోల నుంచి జాతర ప్రాంతానికి ప్రతేక్యక బస్సు సర్వీస్‌లు నడుపుతారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ జాతరలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్ఐలతో పాటు 200మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఆలయ ప్రాంగణంలో తాత్కాలిక పోలీసు అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు.


కోటమైసమ్మ ఆలయం

జంతు బలులతో తీర్చుకోనున్న మొక్కులు..

జాతర సందర్భంగా అమ్మవారికి తీర్చుకొనే మొక్కుల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో వారి వెంటతెచ్చుకున్న మేకలు, గొర్రెలు, కోళ్ళను బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. అయితే ఈ జాతరలో జంతుబలి నిషేదం అంటూ బోర్డులు పెట్టినా భక్తులు వాటిని పట్టించుకోరు.


జాతరలో ఏర్పాటుచేస్తున్న జాయింట్‌వీల్స్

విజయవంతం చేయండి
ఆలయ ట్రస్ట్‌చైర్మన్, ఈవో

ఐదు రోజుల పాటు జరిగే శ్రీ కోటమైసమ్మ జాతరను భక్తులు, ప్రజలు విజయవంతం చేయాలని ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో వేణుగోపాలాచార్యులు కోరారు. ఆలయంలో వారు మాట్లాడుతూ వందల ఏళ్లగా జరుగుతున్న కోటమైసమ్మ జాతరను ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

స్థానిక సమరంలో సత్తా చాటుదాం..

చారిత్రక సభకు భారీ సన్నాహాలు
సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మం అర్బన్ సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సమరంలో సత్తా చాటేవిధంగా పార్టీ నాయకత్వం కార్యకర్తలు కృషిచేయాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా సమితి సమావేశం మంగళవారం ఏపూరి లతాదేవి అధ్యక్షతన సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనే విధంగా పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఇప్పటికే స్థానిక ఎన్నికలు ఆలస్యం కావటంతో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు నిధుల లేమితో డీలా పడ్డాయన్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణను సీపీఐ స్వాగతిస్తుందన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా పని చేయటంతో పాటు కలిసి వచ్చే పార్టీలతో సంప్రదింపులు జరపాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, జెడ్పీటీసీల విషయంలో నిరంతరం పార్టీ నాయకత్వంతో సంప్రదిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. ఈ మేరకు పార్టీ శతజయంత్యోత్సవ ముగింపు సభ డిసెంబరు 26న జరుగనుందని ఈ చారిత్రక సభకు భారీ సన్నాహాలు చేస్తోందన్నారు. ఈనెల 5న చారిత్రక సభకు సంబంధించి ఆహ్వాన సంఘం సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి కేంద్రకార్యవర్గ సభ్యులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రాల కార్యవర్గ సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదిక ప్రవేశ పెట్టటంతో పాటు జిల్లాలో సీపీఐ పోటీ చేయబోయే స్థానాల వివరాలను వెల్లడించారు. సమావేశంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జిల్లా సమితి సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

204 కిలోల గంజాయి పట్టివేత

వివరాలు వెల్లడించిన పాల్వంచ సీఐ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్

బూర్గంపాడు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మోరంపల్లి బంజరలో సోమవారం నిర్వహిం చిన పోలీసుల తనిఖీలో గంజాయిని పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఏపీ రాష్ట్రంలోని చింతూరు నుంచి హర్యానా రాష్ట్రానికి కారులో గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ ప్రసాద్ మోరంపల్లి బంజరలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. అటుగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో హర్యానా రాష్ట్రానికి చెందిన సంజీవ్‌కుమార్ అనే వ్యక్తి తన కారు ఓనర్ ప్రిన్స్‌కుమార్ ఆదేశాల మేరకు ఏపీలోని చింతూరు ప్రాంతానికి చెందిన ప్రధాన్‌ఖారా, లఖన్ హంతల్ అనే ఇద్దరి వ్యక్తుల వద్ద నుంచి గంజాయి తీసుకుని హర్యానా వెళ్తున్నట్లు గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.1.25 కోట్ల విలువ చేసే 204.930 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేయగా ముగ్గరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు ప్రసాద్, నాగబిక్షం, దేవ్‌సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి.. ఆర్టీసీ బస్ ఎక్కి..

హల్‌చల్ చేసిన మహిళ

స్టేషన్‌కు తరలించిన పోలీసులు

చుంచుపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి.. ఆర్టీసీ బస్ ఎక్కి ఓ మహిళ హల్‌చల్ చేసిన ఘటన చుంచుపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (డీలక్స్) కొత్తగూడెం మీదుగా ఖమ్మంకు వెళుతుంది. ఈ క్రమంలో కొత్తగూడెం బస్టాండ్‌లో ఓ మహిళ బస్సు ఎక్కింది. ఆధార్ కార్డు చూపించి టికెట్ ఇవ్వాల్సిందిగా కోరింది. అయితే డీలక్స్ బస్సుల్లో ఆధార్ కార్డు చెల్లదని కండక్టర్ చెప్పడంతో.. ఆగ్రహించిన మహిళ బస్సు దిగి హల్‌చల్ చేసింది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సదరు మహిళ.. బస్సు కిందికి వెళ్లేందుకు ప్రయత్నించి బస్సు వెళ్లకుండా అడ్డుకుంది. దీంతో ప్రయాణికులు, స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మహిళను చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి బస్సును పంపించి వేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.


ఆర్టీసీ బస్ కింద పడుకొని హల్‌చల్ చేసిన మహిళ

తప్పిపోయిన మహిళ... క్షేమంగా ఇంటికి

తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఎన్జీవో సంస్థ..

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం తప్పిపోయిన తన కుమార్తెను కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. కానీ చివరికి తమిళనాడుకి చెందిన పసియిళ్ల తిరుపూర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల సహకారంతో కొత్తగూడెం మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారితో ఆమె మాట్లాడంతో ఆచూకీ తెలిసింది. ట్రస్ట్ సభ్యులే స్వయంగా ఆమెను ఇంటికి తీసుకువచ్చిన సంఘటన భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో చోటుచేసుకుంది. ఇలెందులోని వెంకటపురం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, క్రిష్ణలకు ఈసం నాగమణి, వందన అనే ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు ఈసం నాగమణి నెలరోజుల క్రితం శబరిమలకు అని వెళ్లింది. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలో రైల్‌లో తన బ్యాగ్, సెల్‌ఫోన్ పోవడంతో తిరుపూర్ రైల్వేస్టేషన్‌లో దిగింది. స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఆమెను రైల్వే పోలీసులు పట్టుకుని వివరాలు అడిగగా సరైన సమాదానం చెప్పలేదు. టికెట్ లేకుండా తిరగడంతో పోలీసులు కొట్టి తిరుపూర్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సిబ్బందికి తెలంగాణ రాష్ట్రం ఇల్లెందు మండలం అని వివరాలు తెలియజేయగా.. సిబ్బంది చైల్డ్ వేల్ఫేర్ సఖీ తమిళనాడు ఉమెన్ హెల్ప్‌లైన్ 181 నెంబర్ కాల్ చేసి సమాచారం ఇచ్చారు. అనంతరం కొత్తగూడెం డీడబ్ల్యూవో కార్యాలయానికి సమాచారం అందిచారు. ఐసీడీఎస్ సిబ్బంది 15 రోజులుగా కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేసినా.. ఎటువంటి సమాధానం లేకపోవడంతో తమిళనాడు సఖీ కేంద్రం వారు పసియిళ్ల తిరుపూర్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.తమిల్ సెల్వన్‌కి సమాచారం అందించారు. ఈ మేరకు ట్రస్టు సభ్యులు ఈ నెల 29న ఉదయం ఆమెను తీసుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చేరుకుని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా సమక్ష్యంలో ఆమె నుంచి వివరాలు సేకరించి కౌన్సిలింగ్ నిర్వహించి క్షేమంగా జిల్లాకు చేర్చిన చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పి.తమిల్ సెల్వన్, నవీన్ నారాయణ్, రాజ్‌కుమార్‌లను అభినందించారు. కాగా ఈసం నాగమణికి సంజన, గౌతంకుమార్ సంతానం ఉన్నారు. భర్త మురళీ కొత్తగూడెంలో వేరుగా ఉంటున్నాడు. నాగమణి గతంలో కొత్తగూడెంలోని ఓ న్యూరో సర్జన్ ఆస్పత్రిలో ఏఎన్ఎంగా పని చేసింది. అనంతరం ట్రస్ట్ నిర్వహకులను ఆమెను సఖీ వాహనంలో ఇల్లెందులోని వెంకటపురం గ్రామానికి తీసుకెళ్లి కుటుంబసభ్యులకు అప్పగించారు. నెలరోజుల నుంచి కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వహకులతో పాటు కొత్తగూడెం సఖీ వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ సుభశ్రీ, లీగల్ కౌన్సిలర్ సునీత, పిజియో కౌన్సిలర్ రాజమణి, అంగన్వాడీ టీచర్ శ్రీలతలు ఉన్నారు.


కార్యాలయంలో మహిళతో మాట్లాడుతున్న అధికారి స్వర్ణలత లెనీనా


తల్లిదండ్రులతో ఎన్జీవో సంస్థ ప్రతినిధులు

ఇసుక రవాణాలో నయా దందా

వ్యవసాయ ముడిసరుకు ముసుగులో ఇసుక రవాణా
పోలీసులకు పట్టుబడిన రెండు లారీలు

అశ్వారావుపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణాలో వ్యాపారులు కొత్త ఆలోచనలతో నయా దందా చేస్తున్నారు. సోమవారం రాత్రి ఏపీ రాష్ట్రంలోని కొవ్వూరు నుంచి హైదరాబాదుకు వ్యవసాయ ముడిసరుకుగా చూపుతూ ఇసుకను బస్తాల్లో నింపి రెండు లారీల్లో అక్రమంగా రవాణా చేస్తూ అశ్వారావుపేట పోలీసులకు పట్టుబడిన సంఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. అశ్వారావుపేట రవాణా చెక్ పోస్టు వద్ద సిబ్బంది తనిఖీల సమయంలో లారీల్లో నుంచి నీరు కారుతుండటంతో అనుమానం వచ్చిన సిబ్బందికి వెళ్లి పరిశీలించగా బస్తాల్లో ఇసుకను లోడు చేసినట్లు గుర్తించారు. లారీలో ఉన్న బిల్లులను పరిశీలించగా వ్యవసాయ అవసరాల్లో ముడిసరుకుగా చూపుతూ కనిపించడంతో అక్కడి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ యయాతి రాజు తనిఖీల్లో దొరికిన రెండు లారీలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఒక్కో లారీలో ఇసుక విలువ రూ.70వేల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. ఇసుక అక్రమ రవాణాలో ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అవలంభిస్తుండటంతో పోలీసులకు సవాల్‌గా మారింది.

దళితవాడల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): దళితవాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు పి.సత్యనారాయణ కోరారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో మంగళవారం జరిగిన కేవీపీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకులు ఎన్నికల సమయంలో దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకుని అనంతరం వారి సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. 27ఏళ్ల క్రితం ఆవిర్భవించిన కేవీపీఎస్ ఇప్పటి వరకు దళితుల కోసం ఎన్నో ఉద్యమాలు నిర్వ హించిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రావు, పుల్లయ్య పాల్గొన్నారు.

లారీలో టార్పాలిన్ కప్పి ఊపిరాడకుండా..

అక్రమంగా గోవులు రవాణా చేస్తున్న లారీ పట్టివేత

అశ్వారావుపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని తుని నుంచి తెలంగాణలోని తుక్కుగూడకు 10 టైర్ల లారీలో 46 ఆవులను అక్రమంగా రవాణా చేస్తున్న లారీ అశ్వారావుపేటలో తనిఖీలో పట్టుబడింది. తుని నుంచి గోవులతో బయలుదేరిన లారీ గోవులు కనపడకుండా లారీ పైభాగాన్ని టార్పాలిన్‌తో కప్పి రవాణా చేస్తున్నారు. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అక్కడ రవాణా శాఖ సిబ్బంది లారీని ఆపేందుకు ప్రయత్నించగా ఆపకుండా వెళ్ళిపోతుండటంతో అనుమానం వచ్చి లారీని వెంబడించి పట్టుకున్నారు. లారీలో గోవులను రహస్యంగా కటిక దుకాణానికి తరలిస్తున్నారనే సమాచారం మేరకు లారీని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ యయాతి రాజు గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న లారీని సీజ్ చేసి, లారీపైన, ఇద్దరు వ్యక్తులపైన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని రైతులు అమ్ముకోవాలని కూసుమంచి ఏడీఏ సతీష్ తెలిపారు. మంగళవారం మండలంలోని కాకరవాయిలో పంట నమోదు కార్యక్రమం పరిశీలించారు. అనంతరం వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతులు సీసీఐ ద్వారా విక్రయించేందకుగాను ఏఈవోల వద్ద పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఏఈవో సాధన పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇల్లెందులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సహారాలో మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగం కోల్పోయిన ఎం. రామాంజనేయచారి (52) సోలార్ విద్యుత్‌కు చెందిన సామగ్రి అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం జగదాంబ సెంటర్‌లో ఓ ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లేట్లు అమర్చుతుండగా విద్యుత్ లైన్‌కు ప్లేట్ తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రామాంజనేయచారి మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

నేలకొండపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజేశ్వరపురంలోని మధుకాన్ ఫ్యాక్టరీ కార్యాలయం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతనగర్‌కు చెందిన కొచ్చెర్ల బాలకృష్ణ(40) సుతారి పని చేస్తూ... మంగళవారం పని ముగించుకుని రాజేశ్వరపురం వైపు నుంచి అనంతనగర్‌కి ద్విచక్రవాహనంపై వెళ్తుతుండగా, అమ్మగూడెం నుంచి తుమ్మలపల్లికి వెళ్తున్న మరో ద్విచక్రవాహనం రాజేశ్వరపురం వద్ద బాలకృష్ణ బైక్‌ను ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కింద పడిన బాలకృష్ణను నేలకొండపల్లి నుంచి శంకరగిరితండాకు వెళ్తున్న ట్రాక్టర్ అతన్ని వెనుక వైపు నుంచి తొక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రజిని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న నేలకొండపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు.

బతుకమ్మను అవమాన పరిచిన మహిళపై కేసు

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మను అవమాన పరిచిన మహిళపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి పట్టణ సీఐ టి.శ్రీహరి మంగళవారం తెలిపారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని బతుకమ్మను దేవతగా భావించి మహిళలు పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో మండల పరిధిలోని సిద్దారం గ్రామంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన సింగపోగు కుమారి మద్యం సేవించి బతుకమ్మను అవమాన పరుస్తూ అశ్లీలంగా, అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తడికమళ్ల నాగమణి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పర్ణశాలలో వీరలక్ష్మి అలంకారం

దుమ్ముగూడెం:దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల రామాలయంలో శ్రీలక్ష్మి అమ్మవారు మంగళవారం వీరలక్ష్మి అవతారంలో భక్తులను అలరించారు. కుంకుమార్చన అనంతరం తీర్థ ప్రసాదాలను భక్తులకందజేశారు. ఆలయ ఇంచార్జి అనీల్‌కుమార్, అర్చకులు శ్రీకోటి విష్ణువర్ధనాచార్యులు, భార్గవాచార్యులు, నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



9 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు: ఎస్ఐ

జూలూరుపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు మండలంలో తొమ్మిది సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు. మంగళవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీటీసీ ఎన్నికలకు కాకర్ల, బేతాళపాడు, మాచినేనిపేట తండా, పాపకొల్లు తదితర నాలుగు సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. అదేవిధంగా సర్పంచ్ ఎన్నికలకు, బోజ్యా తండా పంచాయతీ పరిధిలోని వెనకతండా, గుండ్లరేవు, కాకర్ల, సూరారం కరివారిగూడెం, పడమటనర్సాపురం, పాపకొల్లు, వెంగన్నపాలెం తదితర గ్రామాలను గుర్తించామని తెలిపారు. పోలింగ్ సమయంలో సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

జూలూరుపాడు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వర్షాలకు రహదారులు దెబ్బతిని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ వాటికి మరమ్మతులను చేపడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం తగదని ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే. చాంద్‌పాషా అన్నారు. మంగళవారం జూలూరుపాడులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఖమ్మం- కొత్తగూడెం రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలు పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రహదారి పై ప్రయాణాలు సాగించడానికి అవస్థలకు గురి అవుతున్నారని అన్నారు. ప్రజలుప్రమాదాల బారిన ప్రయాణాలను సాగించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. తక్షణమే ఆర్ అండ్ బి అధికారులు ఈ రహదారితో పాటు మండలంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులను చేపట్టాలని కోరారు.

జేకే గ్రౌండ్‌లో దసరా ఉత్సవాలు: కాంగ్రెస్

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలో ఎంతో వైభవంగా నిర్వహించే దసరా ఉత్సవాలు మైసూర్ ఉత్సవాలను తలపించే విధంగా జేకే కాలనీ సింగరేణి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దొడ్డ డానియల్, మండల అధ్యక్షుడు పులి సైదులు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం దసరా ఉత్సవాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో సింగరేణి పాఠశాల జేకే కాలనీగ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈఉత్సవాలకు పలువురు బుల్లి తెర కళాకారులు హాజరౌతారని ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ కొరి, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాంబాబు. జాఫర్, జానీ, చెన్నూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి

● కాలుష్య ప్రభావిత గ్రామాల గిరిజన కాంట్రాక్టర్ల డిమాండ్

పాల్వంచ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ కేటీపీఎస్ పవర్ ప్లాంట్ కాలుష్య ప్రభావిత గ్రామాల యువకులు నష్టపోయే విధంగా విడుదల చేసిన టెండర్ నోటిఫికేషన్‌ను జెన్కో యాజమాన్యం తక్షణమే రద్దు చేయాలని కాలుష్య ప్రభావిత కరకవాగు, పునుకుల, పుల్లాయిగూడెం, సూరారం గ్రామాలకు చెందిన యాష్ కాంట్రాక్టర్లు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో గిరిజన కాంట్రాక్టర్ల నాయకుడు భూక్యా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కేటీపీఎస్ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, గతంలో కాలుష్య ప్రభావిత గ్రామాల వారికే బూడిదను తరలించుకునే అవకాశం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా దానిని జెన్కో పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కోర్టు ఆదేశాలను పాటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హరి, నరేష్, భట్టు వీరన్న, పరీష, కృష్ణ, వీరు, గాంధీ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీడీగా అశోక్ బాధ్యతల స్వీకరణ

భద్రాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులుగా జి. అశోక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. భద్రాచలం ఏటీడీఓగా పని చేస్తున్న అశోక్ డీడీగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న మణెమ్మ ఉద్యోగ విరమణ చేయడంతో ఆమె స్థానంలో అదనపు బాధ్యతలు నిర్వహించేలా పీవో రాహుల్ నియమించారు. అనంతరం అశోక్‌ను డీడీ కార్యాలయ సిబ్బంది శాలువ కప్పి సత్కరించారు.

అంబేద్కర్ కమ్యూనిటీ హాలు పునః ప్రారంభం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం అంబేద్కర్ కమ్యూనిటీ హాలు ఎట్టకేలకు పునః ప్రారంభమైంది. మంగళవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో మూడేళ్లుగా మూతపడిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌కు మోక్షం కలిగి తెరుచుకునేందుకు నూతన కమిటీ నియామకం జరిగింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ ఉత్తర్వులు కాపీని దళిత సంఘ నాయకులకు ఎమ్మెల్యే అందజేశారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ అధికారిక కమిటీలో వ్యవస్థాపక అధ్యక్షులుగా డాక్టర్ మద్దెల శివకుమార్, కూసపాటి శ్రీనివాస్‌లు, గౌరవ అధ్యక్షులుగా సలిగంటి శ్రీనివాస్, జేబీ శౌరీలు, అధ్యక్షులుగా మందా హనుమంతు నియమితులయ్యారు. అదేవిధంగా మాల, మాదిగ సామాజిక వర్గం నుంచి 28 మందిని, మహిళా సభ్యురాలుగా ఏడుగురిని నియమించారు. ఐక్యంగా కలిసి కృషి చేయాలని ఎమ్మెల్యే నూతన కమిటీకి సూచించి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం అభినందనీయం: సింగరేణి జీఎం



అన్నదానం ప్రారంభిస్తున్న జీఎం

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేవినవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు అన్నారు. సింగరేణి ఉద్యోగులు అంతా దైవ కార్యక్రమాలు నిర్వహించడం మరింత మందికి మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్‌లో శరన్నవరాత్రుల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు ఎండి. రజాక్, ఏఐటీయుసి నాయకులు ఘట్టయ్య, డీజీఎం శ్రీకాంత్, క్రిష్టోఫర్, ఇంజనీర్లు శంకర్, అనిల్, ఉపేందర్ బాబు పలు సంఘాల నాయకులు మధు కృష్ణ, పవన్ కుమార్ ఆసీఫ్ యాకుబ్, చందూలాల్, జయ రాజ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ

స్విచ్ ఆన్ చేసిన కమిషనర్ ప్రసాద్



స్విచ్‌ఆన్ చేస్తున్న కమిషనర్

మణుగూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యన ఉన్న సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ కొంతకాలంగా మరమ్మతులకు గురైంది. డివైడర్ల మధ్య వేసిన చెట్ల తొలగింపు కార్యక్రమాలల్లో బాగంగా లైటింగ్ వ్యవస్థ పూర్తిగా పాడై పోయింది. కాగా దసరా పండుగకు పట్టణ ప్రాంతానికి వెలుగు నిచ్చి కొత్త శోభ తెచ్చేందుకు తగిన చర్యలను చేపట్టాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మునిసిపల్ కమిషనర్‌కు ఇటీవల సూచించినట్లు సమాచారం. కాగా 25 రోజుగా మునిసిపాలిటీ కార్మికులు పట్టణ వీధి దీపాలను కొత్తవి అమర్చి వైరింగ్ పనులు పూర్తి చేశారు. మంగవారం రాత్రి మణుగూరు మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ స్విచ్ ఆన్ చేసి సెంట్రల్ లైటింగ్‌ను పునరుద్ధరించారు. ఈ కర్యక్రమంలో మునిసిపాలిటీ సిబ్బంది రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సింగరేణి సహకరించాలి

» ఎమ్మెల్యే కూనంనేని

» సింగరేణి సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేత



అమ్మవారి మండపంలో ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి సింగరేణి యాజమాన్యం సహకరించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంకు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం బస్టాండ్ పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కోరారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఎండితో అభివృద్ధిపై సమీక్ష నిర్వహించి పలు విజ్ఞప్తులు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మిక ప్రాంతాలైన రామవరం ,రుద్రంపూర్, గౌతంపూర్ ఏరియాలలో మాజీ కార్మికులు నివసిస్తున్న క్వార్టర్స్‌ను వారికే ఇవ్వాలని కోరారు. పోస్టాఫీస్ సెంటర్ నుంచి హేమచంద్రాపురం వెళ్లే రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. సిఎస్ఆర్ నిధులను కేటాయించి కొత్తగూడెం పట్టణ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నూతన ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, ఎస్‌వి. రమణమూర్తి పాల్గొన్నారు.

నవరాత్రుల మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

గాజులరాజం బస్తీలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి మండపాన్ని మంగళవారం సందర్శించిన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రత్యేక పూజా కార్యకరమాలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్‌లె ఎండి. ఈసూబ్, మహమ్మద్ సాహేరా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, నాయకులు గడ్డం రాజయ్య, ప్రభాకర్, సతీష్, తేజ, భాను, నరేష్, మసూద్, లలిత్, హరీష్,నాగార్జున, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: పాయం



కరకగూడెం/ పినపాక, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నియోజక వర్గంలో అభివృద్ధి చేసింది శూన్యమని ప్రజా ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుక వెల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్ కుమార్, మండల అధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్, నాయకులు నాగబండి వెంకటేశ్వర్లు, పూజారి వెంకన్న, పూనెం బుచ్చయ్య, కునుసోతు సాగర్, బరపటి వెంకన్న, నేతాజి, రత్తమ్మ, సుజాత, రాము, క్రిష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి బొలిశెట్టి

పినపాక: మండలంలో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ మండల సీనియర్ నాయకుడు బొలిశెట్టి నర్సింహారావు మంగళవారం బీఆర్ఎస్‌ను వీడి ఎమ్మెల్యే పాయం సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అంతేగాక మండలంలోని ముకుందాపురం, దుబ్బగుంపు, సింగిరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, సీపీఎంలకు చెందిన 40 కుటుంబాలు ఎమ్మెల్యే పాయం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వి లక్ష్మీరెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, పేరం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, కొడాలి కృష్ణ, దాట్ల రాజేష్, మధు, బండారు సాంబశివరావు, నవీన్, శంకర్, బొడ్డు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2లో సింగరేణి ఉద్యోగి ప్రతిభ

సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికైన మురళి



ఇల్లెందు, మణుగూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఏరియా సింగరేణి కాలరీస్‌లో సినియర్ అకౌంట్స్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కొమ్ము మురళి గ్రూప్ 2 పరీక్షల్లో తెలంగాణ ప్రభుత్వ సెక్రటేరియల్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ (జీఏడీ)లో అసిస్టెంట్ సెక్షన్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. గ్రూప్ 2 పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 139 వర్యాంకు సాధించిన మురళి మహబూబాబాద్ జిల్లా పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన వాడు. సింగరేణి కాలరీస్‌లో జరిగిన పోటీ పరీక్షల్లో సినియర్ అకౌంట్స్ అధికారిగా నియమితులై ఇల్లెందులో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్ 2 ఉద్యోగం రావడంతో ఆయన సింగరేణి ఉద్యోగానికి రాజీనామా చేసి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా చేరనున్నారు. మురళి ఎంపిక పట్ల పలువురు సింగరేణి అధికారులు, మిత్రులు, మురళిని అభినందించారు.

ఇసుక దొంగలు

(5వ పేజీ తరువాయి)

ఇదే విధంగా ముందు వెళ్లి అక్కడ పరిస్థితిని అంచనా వేస్తుంటారు. ఇసుకను యథేచ్ఛగా రవాణా చేసేందుకు ఆయా శాఖలకు సంబంధించిన కొందరు ఉద్యోగులను ఆకట్టుకొని వారి అండదండలు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరికొందరు పలుకుబడి కలిగిన వ్యక్తుల సహకారాన్ని ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులకు అక్కడక్కడ ఇసుక లారీలు పట్టుబడుతున్నప్పటికీ.. అవన్నీ నామ మాత్రంగానే జరుగుతున్నాయని తెలుస్తోంది. రవాణా అయ్యే ఇసుక వాహనాలలో కేవలం ఒక్క శాతం మా త్రమే పట్టుబడుతున్నాయని, 99శాతం అక్రమంగా తరలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో లక్షల రూపాయలు చేతులు మారుతున్నాయన్నది బహిరంగ సత్యం. ఈ మొత్తం వ్యవహారంపై నిఘా పెంచి పూర్తిస్థాయిలో విచారణ జరిపితే ఈ ఇసుక రవాణాలో ఎన్నో సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయి. రాష్ట్రంలో పల్లె ప్రాంతాల్లో ఉన్న ఇసుక క్వారీలను అందుబాటులోకి తీసుక రాకపోవడం కూడా ఏపీ నుంచి తెలంగాణలోకి ఇసుక రవాణాకు ఆస్కారం కలుగుతుందని, అందువల్ల రాష్ట్రంలో పలు ప్రాంతాలలో స్థానికంగా ఉన్న ఇసుక క్వారీలను అందుబాటులోకి తేవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఏదేమైనా లక్షలాది రూపాయల లావాదేవీలు జరిగే ఇసుక వ్యాపారాన్ని నియంత్రణలోకి తెచ్చేందుకు అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

'స్థానికం'లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

మాజీ మంత్రి వనమా



మాట్లాడుతున్న వనమా

పాల్వంచటౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అన్ని స్థానాల్లో గెలిచి బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవా రం వారి నివాసంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా గొప్ప అవకాశం లభించిందని అని క్యాడర్‌కు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ బత్తుల వీరయ్య, కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, వైస్ చైర్మన్ దాము, పాల్వంచ పట్టణ, మండల అధ్యక్షులు ముంతపురి రాజుగౌడ్, పూసల విశ్వనాదం, మల్లెల శ్రీరామ్మూర్తి, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వర్లు, నాయకులు అన్వర్‌పాషా, అనుదీప్, బాదావత్ శాంతి, సోనా, మడివి సరస్వతి, మల్లెల రవిచంద్ర, కనగాల బాలకృష్ణ, డిష్ నాయుడు, సింధుతపస్వి, భట్టు మంజుల, పూల రవీందర్, పలు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తాం

(5వ పేజీ తరువాయి)

సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. నోడల్ అధికారులు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

● నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎన్నికల నిర్వహణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల అభ్యర్థుల ఖర్చుల నమోదు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందజేశారు. ప్రతీ అభ్యర్థి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించి ప్రతీ అభ్యర్థికి సమాన హక్కులు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో జరిగే రాజకీయ సమావేశాలు, సభలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, కరపత్రాల పంపిణీ, వీఐపీలు పాల్గొనే బహిరంగ సభలు, ఇతర కార్యకలాపాలు నిశితంగా పరిశీలించబడతాయని.. వాటికి అయ్యే ఖర్చులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థి ఖాతాలో నమోదు చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల అధికారికి సమాచారం ఇవ్వకుండా ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి ముద్రణలు చేయరాదని, ఎన్నికల ఫ్లెక్సీలపై ముద్రిస్తున్న వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశాలు నిర్వహించుకునేందుకు అనుమతులు తప్పనిసరి అనీ, అన్నీ పార్టీలు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థనా స్థలాలలో రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, ఎన్నికల నిర్వహణపై వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డిప్యూటీ జెడ్పీ సీఈవో కొండూరు చంద్రశేఖర్, డివిజనల్ పంచాయతీ అధికారి సుధీర్, కాంగ్రెస్ అజ్మీర సురేష్, బీఆర్ఎస్ అనుదీప్, సిపిఐ పార్టీ శ్రీనివాస్, బీజేపీ నోముల రమేష్, సిపిఐ(ఎం) సత్యనారాయణ, సీపీఐ(ఎంసీ) గౌరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● అసత్య ప్రచారాలను నమ్మొద్దు : కలెక్టర్

సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫేక్ వీడియోలను, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని కలెక్టర్ పాటిల్ అన్నారు. ఐడీవోసిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసత్య ప్రచారాలు, సామాజిక మాధ్యమాల్లో ఫేక్ వీడియోలను పెట్టడం కారణంగా ప్రశాంత వాతావరణం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా పొలిటికల్ స్పీచ్‌లు ఉండకూడదన్నారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు జడ్పీటీసీ, ఎంపీటీసీ రెండు విడతలుగా, అలాగే గ్రామ పంచాయతీ మూడు విడతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 9న నోటిఫికేషన్ విడుదలై అదే రోజు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై అక్టోబర్ 17న ముగుస్తుందని చెప్పారు. అక్టోబర్ 23, 27 తేదీల్లో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఫలితాలు నవంబరు 11న ప్రకటిస్తారు. గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో మూడు విడతలుగా జరుగుతుందని, పోలింగ్ ముగిసిన రోజే సాయంత్రం ఫలితాలు ప్రకటించబడతాయన్నారు. మొత్తం 22 జడ్పీటీసీ స్థానాలు, 233 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మొదటి విడతలో భద్రాచలం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 11 జడ్పీటీసీ, 113 ఎంపీటీసీ స్థానాలకు గాను 602 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, రెండవ విడతలో కొత్తగూడెం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 11 జడ్పీటీసీ, 120 ఎంపీటీసీ స్థానాలకు గాను 669 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ప్రతీ విడతలో 20 శాతం అదనపు రిజర్వ్ పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లా మొత్తం 471 గ్రామ పంచాయతీలు, 4,168 వార్డులు, 4,242 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. మొదటి విడతలో 8 మండలాల్లో 159 గ్రామ పంచాయతీలు, రెండవ విడతలో 7 మండలాల్లో 156 గ్రామ పంచాయతీలు, మూడవ విడతలో 7 మండలాల్లో 156 గ్రామ పంచాయతీలలో నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.